క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట తహసీల్దార్గా ఎం.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా చర్ల తహసీల్దార్గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ను నియామకం చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఇక్కడ తహసీల్దార్గా పని చేస్తున్న కృష్ణ ప్రసాద్ రిలీవ్ కాగా ఆయన స్థానంలో శ్రీనివాస్ విధుల్లో చేరారు. విధుల్లో చేరిన తహసీల్దార్కు స్థానిక డీటీ సుచిత్ర, రెవెన్యూ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం తహసీల్దార్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి, సూచనలు చేశారు.

ఆళ్లపల్లి తహసీల్దార్గా ముజాహిద్

గుండాల: ఆళ్లపల్లి మండల తహసీల్దార్గా ఎండి.ముజాహిద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో జరిగిన బదిలీల్లో శకుంతల మండల తహసీల్దార్గా వచ్చారు. కాగా రెండు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో శకుంతల బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ముజాహిద్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

గుడుంబా రవాణాపై కేసు నమోదు

కరకగూడెం: మండల పరిధిలోని సమత్ భట్టుపల్లి వద్ద ఉన్న బుడిదవాగు వద్ద అక్రమంగా నిషేధితను ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి కరకగూడెం ఎస్సై ఏ.రాజేందర్ విశ్వసనీయ సమాచారంతో దాడులు చేశారు. దీంతో ఇద్దరు వ్యక్తులతోపాటు సుమారు 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా నిషేధిత గంజాయి, గుడుంబాను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా మండలంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని ఇప్పటికే 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

పుస్తకం ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సోయం గంగులు జీవిత చరిత్ర పుస్తకాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోయం గంగులు నిజాం ప్రభుత్వానికి, యూనియన్ సైన్యానికి వ్యతిరేకంగా జల్ జంగల్ జమీన్ సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఆదివాసీలు ఐక్యంగా చైతన్యంగా స్వయం పాలన కోసం, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాడడమే గంగులుకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కెచ్చల కల్పన, కొండ చరణ్, దాసరి సాయి, గునిగల శివప్రశాంత్, శాంత, నసీమా, బుజ్జక్క, గౌస్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు..

ములకలపల్లి: ములకలపల్లిలోని ఉమాపృథ్వీ రామలింగేశ్వరరావు ఆయలంలో నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికను ఆలయకమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీసభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 7, 8 తేదీల్లో కల్యాణ వేడుకలను అంగరంగవైభవంగా జరుపనున్నట్లు చైర్మన్ ప్రసాద్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, కొదుమూరి వీరగోపాల్, గాదె సత్యనారాయణరెడ్డి, పూజారి విస్సావజ్జుల సురేశ్శర్మ, పువ్వాల లలితారావు, శ్రీరామల నాగేశ్వరరావు, పుష్పాల చందర్రావు, ఓబుల శెట్టి ప్రభాకర్, సంజీవాచారి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: చట్టాలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఏఎస్సై రెహమాన్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని జవహర్ విద్యాలయం, గౌతమి, గుడ్ న్యూస్, ఏ1 కిడ్స్, సూర్య స్కూల్తోపాటు పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. అపరిచితులు, అనుమానస్పద వ్యక్తులతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వారు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి చెప్పాలని, భయందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల బాధ్యులు ప్రవీణ్, మైథిలీ, కొఠారు చలపతి, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకులంలోని ఇంటర్, టెన్త్ పరీక్షలకు హాజరయ్యే బాలికలకు ఐటీసీ భద్రాచలం మహిళా సమితి(బీఎమ్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎమ్ఎస్ వైస్ ప్రెసిడెంట్ టి.సునీత మెహంతి మాట్లాడుతూ.. పరీక్ష సమయంలో ఉపయోగపడే ప్యాడ్, పెన్సిల్, స్కెచ్ పెన్స్, రబ్బర్, స్కేల్, పౌచ్లను సుమారు 725 మంది బాలికలకు అందజేసినట్లు తెలిపారు. రేష్మశర్మ, ప్రతిభ మనోజ్, ప్రిన్సిపాల్ దేవదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మార్చి 19 వరకు పరీక్షలు
- విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు
- పకడ్బందీగా నిర్వహణపై అధికారుల దృష్టి



అశ్వారావుపేటరూరల్: జూనియర్ కళాశాల కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



మణుగూరుటౌన్: జిరాక్స్ షాపు నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాఘవరెడ్డి



అశ్వారావుపేటరూరల్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీను

దుమ్ముగూడెం: నేటి నుంచి మార్చి19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ఎల్.వెంకటేశ్వర్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ కె.పవన్కుమార్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనుండగా.. 11 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 233 మంది, ద్వితీయ సంవత్సరం 206 మంది మొత్తం 439 మంది విద్యార్థులు ఇక్కడి సెంటర్లో పరీక్షకు హాజరవుతారు. వీరికోసం తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతోపాటు ఆరోగ్య శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన సీఐ, ఎస్సైలు

దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని సీఐ అశోక్, ఎస్సై కేశవరావులు మంగళవారం సందర్శించి పరీక్షల నిర్వహణపై కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లుతో చర్చించారు. అనంతరం తరగతి గదులను నిశితంగా పరిశీలించారు. పరీక్షలలో ఎటువంటి అవకతవకలు జరుగకుండా పరీక్షల నిర్వహణ చేపట్టాలని, కేంద్రాలలోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకెళ్లొద్దని అన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

అశ్వారావుపేట, దమ్మపేటల్లో..

అశ్వారావుపేటరూరల్: ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అశ్వారావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాల(ప్రైవేటు)లో పరీక్షా కేంద్రాలను ఎంపీక చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. అశ్వారావుపేట మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 145, ద్వితీయ సంవత్సరం 187, ప్రైవేటు 16 మంది చొప్పున మొత్తం 348 మంది విద్యార్థులను కేటాయించగా సీఎస్గా రామయ్య, డీవోగా ఝాన్సీ వ్యవహరిస్తారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ప్రథమ సంవత్సరం 344, ప్రైవేటు 29, ద్వితీయ సంవత్సరం 396, ప్రైవేటు 2 ఇద్దరు చొప్పున మొత్తం 771 మంది విద్యార్థులకు కేటాయించారు. ఈ కేంద్రానికి సీఎస్గా డి.నరసింహారావు, డీఓగా వెంకటేశ్వరరావును నియమించారు. అదే విధంగా వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాల కేంద్రంలో ప్రథమ సంవత్సరం 340, ప్రైవేటు 21, ద్వితీయ సంవత్సరం 249, ప్రైవేటు 22 మంది చొప్పున మొత్తం 652 మంది విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షకు హాజరు కానున్నారు. ఈ కేంద్రానికి సీఎస్గా యోశోబు, డీవోగా ఎల్ఎస్ ప్రసాద్ వ్యవహరిస్తారు. ఈ మూడు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాలను స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 81, ద్వితియ సంవత్సరం విద్యార్థులు 109 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు. విద్యార్థులు సకాలంలో చేరుకునేలాగా అర్ధగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్రణాలిక వేసుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చుట్టు ప్రక్కల 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

గుండాల: నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. గుండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి ఇంటర్లో 121 మంది, గురుకుల కళాశాలలో 350 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

దుకాణాలు మూసివేయాలి

మణుగూరుటౌన్: ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష సమయంలో కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని జిరాక్స్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడారు. పరీక్ష సమయం ముగిసిన తర్వాత మాత్రమే జిరాక్స్ సెంటర్ల, సంబంధిత దుకాణాలను తెరవాలని సూచించారు. ఆర్ఐ లీలావతి, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తహసీల్దార్ వెంట ఉన్నారు.

అడవుల్లో పోడు సాగు చేయొద్దు



మాట్లాడుతున్న రేంజర్ రవికిరణ్

ములకలపల్లి: అడవులను నరికి పోడుసాగు చేస్తే కఠినచర్యలు తప్పవని ములకలపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రవికిరణ్ హెచ్చరించారు. గుండాలపాడు శివారులో వలస ఆదివాసీలు సాగు చేస్తున్న పోడుభూములను మంగళవారం పరిశీలించారు. పోడుసాగుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అడవులను రక్షించడం ప్రతీఒక్కరి బాధ్యత అని అన్నారు. పోడు పట్టాలున్న గిరిజనులు తమ నిర్దేశిత ప్రాంతంలో మాత్రమే సేద్యం చేయాలని సూచించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈయేడాది సుమారు 50 హెక్టార్లలో చేపట్టనున్న ప్లాంటేషన్ పనులకు సహకరించాలన్నారు. సెక్షన్ ఆఫీసర్ కోటేశ్వరరావు, నీలమయ్య, భాస్కర్, వెంకన్న, పద్మ పాల్గొన్నారు.

వరిచేలలో పరిశీలన



బాధిత రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న ఎంఏఓ కరుణామయి

ములకలపల్లి: తాళ్లపాయలో రైతులు సాగు చేస్తున్న వరిచేలను మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) కరుణామయి పరిశీలించారు. గ్రామానికి చెందిన పలువురు రైతుల వరిచేలు 60 రోజుల వ్యవధిలోనే ఈనాయని, దీంతో తాలుకంకులు ఏర్పడ్డాయని వారు ఆవేదన చెందుతున్నారు. నిర్ణీత కాలవ్యవధి కంటే ముందే చేలు ఈనడంతో పంట దుబ్బుకట్టలేదని, ఎదుగుదల లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఎంఏఓ కరుణామయి మంగళవారం బాధిత రైతులతో కలసి క్షత్రస్థాయిలో పంటచేలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విత్తనాల కొనుగోలుకు సంభందించిన బిల్లులను పరిశీలించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎంఏఓకు రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ ... సమగ్ర నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

జ్వరాలు అదుపులోనే ఉన్నాయి..

చర్లరూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జ్వరాలు అదుపులోనే ఉన్నాయని పీహెచ్సీ మిడ్ లెవల్ ఆఫీసర్ శిరీష తెలిపారు. ఇటీవల వైరల్ జ్వరాలు, కీళ్ల నొప్పులు ఈ గ్రామంలో అధికంగా నమోదవుతున్న క్రమంలో మంగళవారం ఆమె గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానికలకు పలు సూచనలు చేస్తూ.. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరుశుభ్రంగా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఆశా కార్యకర్తలు లలిత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

'మాస్లైన్' బైక్ ర్యాలీ



దమ్మపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు

దమ్మపేట: ఖమ్మంలో ఈ నెల మార్చ్ 3, 4, 5 తేదీల్లో జరుగనున్న, సీపీఐ (ఎంఎల్) మాస్లైన్ యూనిటీ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ.. ఆ పార్టీ ఆధ్వర్యంలో మోటర్ బైక్లతో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం మండలంలోని పట్వారిగూడెం, పార్కలగండి, జగ్గారం, అంకంపాలెం, గండుగులపల్లి, మొండివర్రే, నాచారం, నాగుపల్లి, మొద్దులగూడెం, ముష్టిబండ, మందలపల్లి, దమ్మపేట గ్రామాల్లో సీపీఐ (ఎంఎల్) మాస్లైన్ ప్రజాపంథా బైక్ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రాలకు సంక్రమించిన హక్కులను హరించివేస్తుందని విమర్శించారు. కేంద్ర పరిధిలోని సీబీఐ, ఐటీ, ఈడీలతో కక్షపూరితమైన దాడులను చేయిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, వెంకటేష్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లో తనిఖీ

పినపాక: ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ను మంగళవారం డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. వాహనాలపై నిరంతరం నిఘా ఉంచాలని, ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్లోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఐ శివ ప్రసాద్, ఎస్ఏ వెంకటప్పయ్య సిబ్బంది ఉన్నారు.

జాతర ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని మీని మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం మొత్తం మామిడి తోరణాలతో అలంకరించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జాతరలో దుకాణాల ఏర్పాటును చేపట్టారు. దేవర బాలలు సోడి శాంతమ్మ,అచ్చమ్మల ఆధ్వర్యంలో ముందుగా మేళాతాళాలు, డప్పులతో కోయ వారి నృత్యాలతో గ్రామంలోని చెరువు దగ్గరకు గంగాస్నానానికి బయలుదేరి వెళ్లారు. గంగాస్నానం చేసిన అనంతరం అక్కడ ప్రత్యేక పూజలను నిర్వహించి పుట్టమట్టి తీసుకుని వచ్చారు. అనంతరం గద్దెలను సుద్దిపరిచి పుట్టమట్టితో ఆలయం మొత్తం మండ మెలగడంతో జాతర ప్రారంభమైంది.

పల్స్పోలియోపై అవగాహన

అశ్వాపురం: మండలంలో పల్స్పోలియో కార్యక్రమం వంద శాతం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం పల్స్పోలియా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుజాత మాట్లాడుతూ.. మార్చి 3న నిర్వహించే పల్స్పోలియో కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సంకీర్తన, ఎంపీడీఓ వరప్రసాద్, ఆర్ఐ నాగమణి, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్కే ఖదీర్, అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

అశ్వాపురం: 1 ఏప్రిల్, 2024లోపు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత అన్నారు.మండలంలో మారుమూల గిరిజన వలస ఆదివాసీ గ్రామాలైన వేములూరు, మనుబోతులగూడెం, గుండ్లమడుగు పల్లెల్లో మంగళవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదుపై గిరిజనులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ రషీద్, ఆర్ఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'విస్తరణ'లో కదలిక



తాగునీటి పైప్లైన్ల ఏర్పాటు పనుల్లో సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట వాసుల చిరకాల కోరికగా ఉన్న రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు మంగళవారం ఎట్టకేలకు మోక్షం కలిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పనులు మంజూరైన సంగతి తెలిసిందే. కాగా గతేడాది జూన్ 2వ తేదీన విస్తరణ పనులను ఆనాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించగా.. ఈ పనులకు కొద్ది రోజుల్లోను అనేక కారణాలతో బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ విజయం సాధించడం చకచక జరిగిపోయాయి. కానీ ఈ విస్తరణ పనులు మాత్రం ఎక్కడి గొంగలి అక్కడే ఉన్న చందంగా మారాయి. తాజాగా అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవతో ఎట్టకేలకు ఈ పనుల్లో కదలిక వచ్చింది. తాగునీటి పైపులైన్ల పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించడంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు పైపులైన్ల పనులను ప్రారంభించారు. ఈ మేరకు భద్రాచలం మార్గంలో జేసీబీలతో కాలువలు తీసి వాటిలో తాగునీటికి సంబంధించిన పైపులైన్లను ఏర్పాటు చేయించే పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. పైపులైన్ల పనులు పూర్తి కాగానే, విస్తరణ పనులు సైతం ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.

అన్నిరంగాల్లో భద్రాద్రి అభివృద్ధి



మాట్లాడుతున్న నందిని, పక్కన మధుసూదన్ సాయి

భద్రాచలంటౌన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రంపై గత పాలకులు వివక్షత చూపడంతో పాభవం కోల్పోతూ వచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లు నందిని తెలిపారు. భద్రాచలంలో మంగళవారం గ్లోబల్ హ్యుమానిటేరియన్ మిషన్ వ్యవస్థాపకుడు మధుసూదన్ సాయి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తెలంగాణలో బడికి వెళ్తున్న విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సద్గురు మధుసూదన్ సాయి ట్రస్ట్ ప్రారంభిస్తుండగా, 50 శాతం నిధులను రాష్ట్రప్రభుత్వం భరించేలా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది బాలలకు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగల శేషాద్రి, గొట్టిముక్కల వేణుమాధవ్, కోటి రామస్వరూపాచార్య తదితరులు పాల్గొన్నారు. కాగా, మిషన్ వ్యవస్థాపకులు మధుసూదన్ సాయి తొలుత భద్రాచలం సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకోగా, పండితులు వేదాశీర్వచనం, ఈఓ రమాదేవి జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

కొడిపల్లి శ్రీనివాస్కు అంబేడ్కర్ అవార్డ్



శ్రీనివాస్ భార్యకు అవార్డు అందించి సన్మానిస్తున్న అకాడమీ బాధ్యులు

మణుగూరురూరల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, మణుగూరు ఏరియా హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు కొడిపల్లి శ్రీనివాస్కు మరణాంతరం బహుజన సాహిత్య అకాడమీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును ప్రకటించింది. మండలంలోని పీవీ కాలనీ హెచ్ఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సభలో అకాడమీ అంతర్జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ వివరాలు వెల్లడించారు. కార్మిక సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీసిన శ్రీనివాస్ యువతకు ఆదర్శప్రాయుడని తెలిపారు. అనంతరం ఆయన భార్య శ్రీలతకు అవార్డు అందజేశారు. హెచ్ఎంఎస్ ఏరియా అధికార ప్రతినిధి జీవన్ జోయల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.నరర్సింహారావు, పి.రమేష్, కృష్ణంరాజు, మేకల ఈశ్వర్, నాసర్పాషా, మంగీలాల్, శనిగరపు కుమారస్వామి, ఎం.సంజీవ్, ఎస్.జ్యోతి, మానస, గుప్తా పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మాదే..

గుండాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేస్తామని ఐఎన్టీయూసీ నాయకుడు శంకర్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఊపొందుకుంటోందని, రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న యాత్రకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్నట్లు తెలిపారు. తన గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని కోరారు. గుండాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఐటీఐ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొంబోయిన ముత్తయ్య. మండల అధ్యక్షులు కోడెం ముత్తయ్య. ఈసం పాపారావు. ఎస్.కె ఖదీర్. అజ్మీర మోహన్. పుణ్యం సమ్మయ్య. ఈసం సమ్మయ్య. వాంకుడోత్ రమేష్. సంపత్. తదితరులు పాల్గొన్నారు.

భద్రతా అవగాహన సదస్సు

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం ప్రాథమికోన్నత పాఠశాలలో భారజల కర్మాగారం మణుగూరు ఆధ్వర్యంలో మంగళవారం భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. సైంటిఫిక్ అసిస్టెంట్ వీఎస్.మురళీకృష్ణ విద్యార్థులకు భారజల కర్మాగారం విశిష్టతను, రాబోయే తరాలకు భారజలం ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్ను తయారు చేయగలిగే సామర్థ్యాన్ని వివరించారు. భారజలం ఉత్పత్తిలో విడుదలయ్యే విషవాయువులపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, చేతి రుమాలులు, స్వీట్లు పంపిణీ చేశారు. భారజల కర్మాగారం ఉద్యోగి శాంతాబాయి పాఠశాలకు వాటర్ కూలింగ్ ఫ్రిజ్ను వితరణగా అందజేశారు. శాంతాబాయికి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్.కె.ఖదీర్, హెచ్ఎం భాస్కర సూరి, భద్రతా సిబ్బంది సాగర్బాబు, శాంతాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రీదేవి బ్రహ్మోత్సవాలు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం ప్రాంతంలో ఉన్న పంచముఖ వేదగాయత్రీదేవి అమ్మవారి దేవాలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం ఉదయం ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గీతాధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, విష్ణు సమస్రనామం, హనుమాన్ చాలీసా, లలితా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అక్కినేపల్లి వసంతాచార్యులు మాట్లాడారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణంలో పీటలపై కూర్చోదలచిన దంపతులు ముందుగా ఆలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రదీప్ శాస్త్రీ, భక్తులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల సమ్మె



భద్రాచలంఅర్బన్: పోస్ట్మెట్రిక్ హాస్టల్ వద్ద సమ్మె నిర్వహిస్తున్న కార్మికులు

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ కళాశాల అనుబంధ హాస్టల్స్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన 18 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెను సంఘం జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తమ సమస్యల విషయంలో జోక్యం చేసుకుని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, నాయకులు రామారావు, సుభద్ర, శ్యామల, నాగమణి ఆదిలక్ష్మి, కాంతమ్మ, రామయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్లు మంగళవారం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. డైలివేజ్ వర్కర్లు 7 నెలల జీతాలు, ఔట్సోర్సింగ్ వర్కర్ల 18 నెలల జీతాల కోసం సీఐటీయూ పిలుపు మేరకు సమ్మె చేపట్టారు. ఔట్సోర్సింగ్ వర్కర్లు సమ్మె చేయడం మూలాన ఇంటర్మీడియట్ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులకు వంటలు పూర్తిగా బంద్ అవుతాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో సమ్మె చేయటానికి కార్మికులు సిద్ధపడినప్పటికీ ఐటీడీఏ అధికారులు కానీ రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి గాని స్పందన లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి పేర్కొన్నారు.